కాంక్రీట్ జంగిల్

చైతన్యస్రవంతి కథ

డా.ఎం.హరి కిషన్

డా.ఎం.హరి కిషన్
94410 32212

కాంక్రీట్ జంగిల్

మరికొద్ది క్షణాల్లో పరీక్ష. బుక్కు వేగంగా తిప్పసాగాను. బెల్ కొట్టారు. టెన్షన్. అరచేతుల్లో చెమట. పేపరిచ్చాడు. కళ్ళు అక్షరాల వెంట... అన్నీ వచ్చిన ప్రశ్నలే. గాలిలో తేలిపోతున్నట్లుగా అనిపించింది.

రాయాలకున్నా, పెన్ను ముందుకు సాగలా. ఏమీ గుర్తుకు రావడంలా. గజిబిజి. తీవ్రంగా ఆలోచించసాగాను. నరాలలో నొప్పి. నుదుటిపై ధారగా చెమట. లాభం లేదు. సమయం గడిచిపోతూ వుంది. అందరూ వేగంగా రాసేస్తున్నారు. గుంపులు గుంపులుగా... ఒకరికొకరు చెప్పుకుంటూ... నవ్వుకుంటూ... డిస్కషన్స్ చేసుకుంటూ... జేబుల్లోంచి, చేతుల మడలత్లోంచి, బాక్కులోంచి, బ్రాల్లోంచి... కాపీలు, బుక్కులు, పేజర్లు, సెల్‌ఫోన్లు... గుసగుసలు... చిరునవ్వులు. కేరింతలు... ఇన్విజిలేటర్ చుట్టూరా అటెండర్లు, అధికారులు, బంధువులు, పోలీసులు, నాయకులు... కత్తులతో, లాఠీలతో, నోట్లకట్టలతో... ఇన్విజిలేటర్ మౌనంగా చూసీ చూడనట్లుగా, బిగుసుకుపోయి, రాయిలా... మనిషా... విగ్రహమా... విగ్రహంలాగే వుందే...

''సార్'' పలకడంలేదు. చలనం లేదు. అదేంది అలా కరిగిపోతున్నాడు! ఎక్కడ... ఎక్కడికి పోయాడు. ఎవరా చివరి బెంచీలో పరీక్ష రాస్తున్నది. ఇన్విజిలేటరా... విద్యార్థా... ఇన్విజిలేటర్ లాగే వున్నాడే!

'రేయ్! ఏంటా పిచ్చి చూపులు. తొందరగా రాయి'' అదిరిపడ్డా. ఎదురుగా నాన్నా, చెల్లీ... ఏడుస్తున్నారు... ముందువాని దాంట్లోకి తొంగి చూశా. గజిబిజిగా అస్పష్టంగా... కనీసం రెండైనా రాస్తే పాస్ కావచ్చు. తలబాదుకున్నా. కళ్ళనుండి నీళ్ళు ప్రవాహంలా. పేపరు తడిసిపోతూ వుంది. అమ్మానాన్న చెల్లీ బంధువలు స్నేహితులు... చుట్టూ చేరి విరగబడి నవ్వుతున్నారు. ఇంకో ఐదు నిముషాలు... టైమయిపోతూవుంది.

ఏమిటా అరుపులు... కేకలు... గందరగోళం... జనంలోపలికి వేగంగా దూసుకు వస్తున్నారు. ఒకరిపైఒకరు. గది పట్టడంలేదు. ఇదేంది ఇలా వెనక్కు వెనక్కు నెట్టేస్తున్నారు. తొక్కిసలాట. ఊపిరందడం లేదు. పేపరెవరో గుంజారు. గుంపు ఒక్కసారిగా పేపరుమీదికి. కమాన్ పరుగెత్తు. ఎదురుగా... ఎటుచూస్తే అటు... జనసముద్రం! అన్ని వేపులనుంచి ఒక్కసారిగా పేపరు మీదికి... పేపరు ముక్కలు ముక్కలుగా గాలిలో... పట్టుకోడానికి ప్రయత్నించా. అందడం లేదు. దూరంగా అందనంత దూరంగా ఎగురుతూ... పరుగెత్తసాగాను. ఎక్కడ బడితో అక్కడ చినిగిన ముక్కలు... ఏరసాగాను.

''గణ గణ గణ గణ''

శత్రు సౌధాన్ని బద్దలు కొడుతున్న ఫిరంగి గుండ్లలా... కర్ణభేరిని తూట్లు పొడుస్తున్న శబ్ద పరంపరలు...

"ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ గరుడ ధ్వజా..."

భక్తి... నిశ్శబ్దాన్ని ధ్వంసం చేస్తూ, ప్రశాంతతను భంగం చేస్తూ మరచిపోతున్న భగవంతుని పదేపదే గుర్తు చేస్తూ ఆహ్వానం లేకపోయినా చెవులలో చొరబడతూ, ఎంటీవీ మత్తులో జోగుతున్న యువతరంతో అస్తిత్వం కోసం పోరాడుతూ వుంది.

లే... కళ్ళుతెరు... వెంటాడే కలలోంచి బయటపడు. అటూ యిటూ దొర్లుతూ నిద్రపోడానికి వృధా ప్రయాసెందుకు. ఈ శబ్దాలు నిన్ను వదలవ్.

ఇంకా ఎంతసేపామత్తు. నిన్న రాత్రి బుజ్జిగాడు చూపించిన ఇంటర్నెట్ నగ్న ప్రపంచంలో, నలుమూలలా వున్న అమ్మాయిల సోయగాలతో, అనుసంధానాన్నేర్పరచుకున్న నేత్రాలు తెరుచుకోనంటున్నాయా... రాత్రంతా కళ్ళు మూసుకొని పదేపదే ఆ మాయా ప్రపంచాన్ని ఆహ్వానిస్తూ, రూపాలను ఊహలతో నగిషీలు చెక్కి, హత్తుకొని, ఒత్తుకొని, ఆవేశపడుతూ, ఆక్రమిస్తూ, సంభోగిస్తూ, స్వయంతృప్తి పొందుతూ గంటలు నిముషాల్లా మారిపోతుంటే అర్ధరాత్రి వరకూ ఆ తీయని కతల్లోనే కరిగిపోతే... ఎలా తెరుచుకుంటాయ్ నీకళ్ళు. వినబడ్డం లేదా... రెండ్రోజులకోపారి రెండు గంటలు మాత్రమే పారే వీధి కొళాయిల వద్ద అనాగరికులుగా మారిన నాగరికుల అరుపులు, కేకలు, బూతులు, బిందెల చప్పుళ్ళు.

లే... లేచి నీవు చదివిన చదువూ, మంచీ మర్యాద మరచి రెండు బిందెలతో క్రూరమృగంలా మధ్యన జొరబడు.

"గణ గణ గణ గణ"

ఎక్కడ చచ్చిందీ అలారం. పక్కనే వుంటే చటుక్కున ఆఫ్ చేసి మరలా ముసుగు తన్ని నిద్రపోతావేమోనని ముందు వూహించి, అందనంత దూరంలో గూట్లోపెట్టావు కదూ. లేచి వెళ్ళాల్సిందే. తప్పదు. అడుగులు బరువుగా పడుతున్నాయి. మజ్జెక్కువవుతుందీ మధ్య. చలాకీగా, హుషారుగా ఎలా వుండేవాడివి. నొక్కు, మయుని మహిషపు లోహపు గంటలవి.

చూడు గదంతా ఎలాగుందో. జలాడిలో రాత్రి తిన్న అన్నం గిన్నెలూ... నాలుగు రోజుల్నించీ అర్ధరాత్రి వరకు దిద్దీ దిద్దీ విస్తుగ్గా విసిరి మూలకు కొట్టిన కాంపోజిషన్లూ, కుర్చీపై విడిచిన బట్టలు, రెండ్రోజుల కిందట స్నేహితులతో సరదాగా తాగిన త్రిబులెక్స్ మిలిట్రీ రమ్ము సీసా, ఎక్కడ బడితే అక్కడ విసిరేసిన సిగరెట్ పీకలూ, నుసీ, వాక్ ఇన్ ఇంటర్వ్యూ పేపర్ కటింగ్స్, ఉద్యోగసోపానాలు, విజయాలూ... బ్రహ్మచారి కొంపంటే ఇలాగే వుంటుందేమో. కమాన్ క్లీనిట్. చీపురు తీసుకో. వారానికోసారైనా పేరుకుపోతున్న గతాన్ని ఎత్తి పారబొయ్యి.

ఏ రోజు దా రోజు శుభ్రం చేస్తే ఇలా చెమటలు పట్టేంత శ్రముండదు గదా.

మిషన్లో చెరుకు రసం ఆఖరిబొట్టు వరకూ పిండినట్టు అస్తిపంజరం లాగున్న ట్యూబును, ఒకటో తేదీ జీతం వచ్చి నీ జేబు

నిండేదాకా ఆగకుండా, ఆపకుండా ఏమూలో దాక్కున్న పేస్టు బయటికి వచ్చేట్టు బలమంతా ప్రయోగించు. అదిగో వీధి కొళాయిలో నీళ్ళొచ్చినట్టు... వస్తుంది చూడు. కమాన్ బ్రష్‌చేయ్.

తక్షణ లబ్ధి కోసం సబ్సిడీ రాజకీయాలతో రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలనేమాత్రం పట్టించుకోని రాజకీయనాయకుల అనాలోచిత స్వార్థ నిర్ణయాల వల్ల రోజురోజుకీ పెరిగి పోతున్న కరెంట్ కోతతో, ఊపిరాడని గదిలో, ఉక్కిరి బిక్కిరవుతూ, బాయిలర్ కోడిలా వుడికి పోతున్న నీ శరీరాన్ని శుభ్రం చేయాల. బకెట్లో హీటలర్ పెట్టు. కరెంటు మీటర్‌లోకి ఎక్స్రే పేపరు తోశావా! మీటర్ చూడు ఎలా గిర్రున తిరుగుందో విష్ణు చక్రంలా. కమాన్ స్టాపిట్. నీళ్ళు కాగేసరికి అంట్లుతోమి, అన్నంగిన్న ఎక్కించాలి. నువ్వంత నెమ్మదిగా తాబేలులా కదిలితే ఎలా. చిన్నతనంలో మీ అమ్మమ్మ చెప్పిన కథలో గెలిచింది తాబేలే గదా. ఒరె వెధవా! అది ఆనాటి ఉబుసుపోని కథ. ఈనాటి పోటీ ప్రపంచంలో తాబేళ్ళు నెగ్గలేవు. పనిరాక్షసులదే రాజ్యం. పాలు తాగాలంటే వేలవేల మైళ్ళు దాటుతూ ప్రపంచంలో ఎక్కడ ఏ మూల ఏ అవకాశం నీ కోసం వేచి వుందో వెతుకుతూ పరిగులెత్తాల్సిందే.

నీళ్ళు దించి అన్నం గిన్నె ఎక్కించు. స్నానం చేసి తొందరగా బయటపడాల. రాము నీ కోసం ఎదురు చూస్తువుంటాడు. కూరలు కింది హోటళ్ళో తెచ్చుకోవచ్చు. నైట్ డ్యూటీ కెళ్ళిన నీ రూమ్మెట్ శివ ఇంకా రాలేదే. ఎక్కడకెళ్ళిచచ్చాడో... ఏమూలో పడుకొని డ్యూటీ చేయకుండా గుర్రు కొడుతుంటాడు. ఏదో ఓ రోజు పట్టుబడ్డం ఖాయం. కమాన్ డ్రసప్. ఏడవుతూవుంది బాగానే వున్నావు గాని

ఇక ఆ అద్దం ముందు నుంచి పద. కింది హోటల్లో టిఫిన్ చేసి రోడ్డుమీద పడుదువ్ గాని. శివగాడు వచ్చే వేళయింది తాళంచెవి గూట్లో పెట్టు. జాగ్రత్త. కడుపు జారినా తీసుకోవచ్చేమోగానీ కాలు జారితే తీసుకోలేం. నెలకు ఐదొందలు జీతమొస్తూనే వసూలు చేస్తాడు గానీ, నీవెన్ని సార్లు చెప్పినా, మొరపెట్టుకున్నా మొత్తుకున్నా ఈ నరకలోకపు సోపాలనాలను ఏమాత్రం రిపేరు చేయించడు. జాగ్రత్తగా దిగు పోయినెన్నెల జారి కళుక్కుమన్న కాలు మూడ్రోజులు అటూ యిటూ తిరగనీయకుండా, తీరిగ్గా యింట్లోనే కూర్చోబెట్టినది మరచిపోలేదు గదా!

"సత్యం టిఫిన్ సెంటర్" నల్లని బోర్డుపై ఎర్రని అక్షరాలు. కమ్మని మసాలా దొసె వాసన. స్టవ్ మీద వుడుకుతున్న టీ. తెల్లని టేబుల్‌పై కాఫీ మరకలు. రెహ్మాన్ సంగీతపు హోరు. అరుపులు, కేకలు, విసుగులు, నిట్టూర్పులు, సంతృప్తుల మధ్య రంజుగా సాగుతున్న యువకుల చర్చలు. సినిమా హీరోయిన్ల, కాలేజీ అమ్మాయిల సోయగాల ప్రబంధవర్ణనలు. వేగంగా కాలం గడిచే రసవత్తరమైన కబుర్లు...

పనీపాటలా కొడుకులకి. చెత్తమాటలూ, చెత్తకబుర్లూ. ఇండ్లలో రెక్కలు ముక్కలు చేసుకొని, తాకట్లుపెట్టి, వడ్డీలకి తెచ్చి పంపించే మని ఆర్డర్లు తిని అరగత... హలో! ఆగాగు. ఎందుకురా నీకంత కోపం. నీవూ ఒకప్పుడు వాళ్ళలో మెంబర్వే కదా. మరచిపోయావా ఆ రోజులు, గలాటాలు, సెక్స్ సినిమాలు, బీరు బాటిళ్ళు, ప్రేమలేఖలు, రాయబారాలు, స్ట్రైకులు, సెకండ్‌షోలు... వస్తారులే

ఏదో ఓ రోజు నీ స్థితికి. అప్పుడర్థమవుతుంది. అంతవరకన్నా ఆనందంగా బతకనీ. కమాన్ ఎంజాయ్ మై డియర్ బాయ్స్, ఈ క్రౌర్య కౌటిల్య కల్పిత కఠిన దాస్యశృంకలాలు కమ్ముకోకముందే, క్షణాల్లో కాలం కరిగిపోయే కమ్మని కలల లోకంలో కొద్ది రోజులన్నా.

"ఏం సార్! ఇడ్లీయేనా"

తలూపు. తప్పదు. అతి చవకగా ఆంధ్రదేశంలో దొరికే ఏకైక వంటకం ఇదే కదా. రోజూ తినీ తినీ మొహం మొత్తుతుందా... తప్పదు, దోసెలు, పూరీలు, మైసూరు బజ్జీలు, పెరుగువడలు నీ తాహతుకందవు. ఇప్పటికే బాకీ కొండలాగా పెరిగి కూర్చుంది. పోయిన నెల బీఎస్సార్‌బీ పరీక్షకు ఫీజు కట్టి, డబ్బు సరిపోక బాకీ సగమే కడితే, గద్ద ముక్కు ఓనర్ గాడు ముక్కు గీరుకుంటూ, తన దయాదాక్షిణ్యా కటాక్ష వీక్షణాలను నిలువెల్లా నీ పై ప్రసరింపజేస్తూ... "ప్రతినెల సరిగ్గానే కడ్తుండిరే. ఏమన్నా యిబ్బందా. కాస్త మా పరిస్థితి గూడా ఆలోచించండి. నెల నెల సరిగ్గా కట్టకపోతే మేమేం గావాల. మీరు మంచోళ్ళని బాకీ యిస్తున్నా. ఈ సారి మొత్తం కట్టడం మాత్రం మరచిపోవద్దు" అంటూ సుతిమెత్తగా తగలాల్సినచోట తగిలేటట్లు వార్నింగ్ యిచ్చాడు. బోడి ఫ్రీ గా పెడుతున్నట్లు. ప్రతి నెలా జీతమొస్తూనే యిస్తూనే వున్నావు గదా.

"ఇడ్లీ తీసుకోన్నా"

"రేయ్ వాసూ... జీతమెంతిస్తార్రా నీకు"

"రోజుకు ముప్పై. మధ్యాహ్నం, రాత్రి భోజనం. చాయ్ మనిష్టమన్నా"

“ఎంత సేపు”

“పొద్దున్నే పదికొస్తే రాత్రి తొమ్మిదో, తొమ్మిదినరో అవుతుంది గానీ, ఎందుకన్నా అట్లడుగుతున్నావ్”

“ఆ... ఏంలేదు. దీంట్లో చేరితే బాగుంటుందేమోనని”

“పోన్నా... తమాషాలాడ్డానికి పొద్దున్నే నేనే దొరికానా. మీరెక్కడ. మేమెక్కడ. బతకలేక చేస్తున్నా గానీ... వస్తానన్నా. దోసేయాలి”

ఎందుకురా నీకీ పనికిరాని, సంపాదన లేని చదువు. వాన్ని చూడు... నీ అంత సంపాదన. తిండి ఫ్రీ.

పొద్దున్నుంచి రాత్రి వరకు లెసను ప్లానులూ, కాంపోజిషన్లు, అసైన్‌మెంట్లూ, ప్రయివేయి క్లాసులు, నోట్సుల చెకప్పులూ... రాత్రి పదో పదిన్నరో... చదువుకున్న గాసగానిలా బానిస చాకిరీ. సెలవుల్లా, పాడులా. సండేలు ప్రయివేటు క్లాసులు, పోకపోయినా, లేటైనా జీతంలో కోత. అందరి కడుపుతూ కొట్టి లక్షలు సంపాదించి అంతస్తుల మీద అంతస్తులు లేపినాడు. ఐనా ఆశ చావలా. మొన్న వాడి కొడుకు బండిమీద స్పీడుగా వస్తూ, మలుపు తిరుగుతున్న లారీని చూసుకోక... బాగైంది నా కొడుక్కి. పాపం ఊరికే పోతుందా...

లేలే. అదిగో బాకీ బుక్కు. సంతకం చేయ్. ఎంతైందో చూడకు. మైనస్‌లూ, డివైడిడ్‌బైలే తప్ప ప్లసులూ, ఇంటూలు వుండవ్. రాబడి ఖర్చుల జమా లెక్కలేసుకుంటూ యిప్పటినుంచే ఎందుకు బాధ పడతావ్.

నెలనెలా జీతాలిచ్చేది అప్పులు తీర్చడానికే మై బాయ్. సిగ్గు పడొద్దు. ఏదో ఓ రోజు చెప్పా పెట్టకుండా పెట్టాబేడా ఎత్తేసేయ్. ఊర్కుంటాడా... కనబడితేగదా... పొరపాటున ఎక్కడైనా, ఎప్పుడైనా బజారులో ఎదురుపడినపుడు నలుగురిలో పట్టుకొని నాలుగు చివాట్లంటిస్తే నీకెం అమర్యాద. నలుగురూ నిన్ను చూసి నవ్వరూ. అయినా అప్పు చెయ్యని దెవ్వడు భాయీ ఈలోకంలో. అందరూ అందరికీ ఋణపడినోళ్ళే. ప్రతి ఒక్కని లపై వానానడుగకుండా, అనుమతి తీసుకోకుండా, కనీసం మర్యాదకైన చెప్పకుండా తలాయింత. తాకట్టులో భారతదేశం.

''తీర్చకుండా చస్తే ఋణం తీర్చుకోడానికి మళ్ళీ పుట్టాలంటుందికదా" మీ నానమ్మ. జన్మజన్మల ఋణానుబంధం. నీ కోసం రాముగాడెదురు చూస్తుంటాడు. ఈ రోజు పొద్దున్నే ఖచ్చితంగా యిస్తానన్నావ్. ఇప్పడికే మూడు నెలలైంది. ఏమనుకుంటున్నాడో. ఏమీ అనుకోడులే. వాడు నీ ఆప్త మిత్రుడు. నిన్నెప్పుడైనా ఆట పట్టించడానికి ''లేవరా" అంటే ''తిరుపతి హుండీలో డబ్బుల్లేవంటే నమ్ముతానుగానీ, నీ జేబులో డబ్బుల్లేవంటే నమ్మను గానీ యియ్యిరా చాలా అర్జంటు. నువ్వు తప్ప నాకెవరున్నా" రంటూ చనువుగా వాని జేబులో చేయివేసి తీసుకుంటావ్. అవసరానికి నిన్ను ఎన్ని సార్లు ఆదుకోలేదు. స్నేహితుడంటే వాడే. దోస్త్ మేరా దోస్త్... తూ హై మేరా దోస్త్...

నడు. వేగంగా నడు. బీ-క్యాంప్. పాతబస్టాండ్. మూడు కిలోమీటర్లు. నడక ఆరోగ్యానికి చాలా మంచిది.

ఎంత వేగంగా అలవోకగా అలవాటుగా వెళ్ళిపోతున్నాయీ కాళ్ళు. "నీది ఎక్కర్‌సైజ్ బాడీరా" అంటాడు సుందర్రావ్. రోజూ రానూ పోనూ ఆరు మైళ్ళు నడవడమే నీ సౌందర్య రహస్యం. కానీ ఎంత అర్జంట్ పనైనా నడకే. ఓ సైకిలన్నా కొనుక్కో. మొన్న రషీద్ సైకిలు షాపులో పాత సైకిలొకటి మూడొందలన్నాడు. అదే ఆదరణ సైకిల్ కొత్తది ఆరొందలకే. నిరుపేద బీ.సీ.ల కందాల్సిన ఆదరణ... డబ్బునోనికో, పలుకుబడునోనికో... ఎవని స్వార్థం వానిది. వాళ్ళ అనుయాయులకీ, కనుసన్నల్లో, మెలిగేటోళ్ళకి, దొంగవోట్లు గుద్దేటోళ్ళకీ, బంధువులకీ, వాళ్ళు సిఫారసు చేసినోళ్ళకీ... జనాలెట్లాపోతేనేం. ప్రసాద్ మంగలి షాప్ కర్నూలుల్లోనే ఫేమస్. అధునాతన పరికరాలతో, అరడజను వర్కర్లతో, నాయీ బ్రహ్మణ సంఘ నాయకత్వంతో, సొంత యింటితో... ఐనా ఆదరణ. నూతన పరికరాల సరఫరా. మూడ్రోజులకే సైకిలమ్మేశాడు.

నీకు రెగ్యులర్‌గా కటింగ్ చేసే కృష్ణ, కళ్ళలో విషాదం కమ్ముకుంటుండగా, జీరబోయిన గొంతుతో, నిరాదరనకు గురైన తన చిన్న బంకును చూపిస్తూ నీ దగ్గర తన బాధను వెళ్ళగక్కుతూ వుంటాడు.

"హలో!"

ఎవడీడు. చనువుగా పలుకరిస్తున్నాడు. సుపరిచతమైన ముఖమే. చిరునవ్వు లొలికిస్తున్నాడు. లక్ష్మణ్. కరెక్ట్. లక్ష్మణే. నీ పదో తరగతి ప్రాణ మిత్రుడు. మరచిపోయావా చిన్ననాడు ఇద్దరూ కల్సి బడెగ్గొటి తుంగభద్రలో ఈదులాడి తరువాత రోజు సారు

చేతిలో తన్నులు తిన్న సంగతి, రోడ్డుమీద ఎవరో విసిరి పారేసిన ఎంగిలి సిగరెట్టు తలా వొక దమ్ములాగి, పొగ ఊపిరి తిత్తుల్లోకి దూసుకుపోగా దగ్గీ దగ్గీ కళ్ళ నీళ్ళతో యిందులో అంత ఆనందమేముందబ్బా అని చర్చించుకొని ఆశ్చర్యపోయిన సంగతి...

"ఏరా అలా చూస్తున్నావ్. గుర్తుపట్టలేదా"

"ఛ... అదేం లేదురా... నిన్ను మరచిపోతానా. చాలా రోజులైంది గదా. బాగున్నావా. ఏం చేస్తున్నావిప్పుడు. ఎక్కడున్నావ్"

"నాన్నీ మధ్యనే చని పోయాడ్రా. ఉద్యోగమిచ్చారు. నువ్వు బాగున్నావు కదా. ఇప్పుడే మన క్లాస్‌మేట్ నాగేంద్రగాడు కల్సి నీ గురించి చెప్పాడులే. కొంచం అర్జంటు పనిమీద పోతున్నా. లేకుంటే ఇన్ని రోజుల తర్వాత కలిసిన నిన్నొదుల్తానా. రూం దగ్గర కొస్తాలే, వచ్చే నెలే పెళ్ళి. తప్పకుండా రావాలి. ముందుగానే చెప్తున్నా. సరేనా... వస్తా..."

వాడెళ్ళిపోయాడు గానీ పద బయలుదేరు. ఇంతకీ నాన్న చనిపోయాడని వాడంటున్నప్పుడు తళుక్కున మెరిసిన విషాదాన్ని, ఉద్యోగమిచ్చారన్నప్పుడు కళ్ళలో వెలిగి మాయమైన ఆనందాన్ని నీవు గుర్తించావు కదూ.

అదృష్టమంటే వాందే. ఇంటర్ గట్టెక్కలేకపోయాడు. ఇప్పుడు పెన్షన్, పి.ఎఫ్. అమౌంట్, ఎల్.ఐ.సీ. డబ్బులు, ఉద్యోగం. ఆహా! ఏమి లక్కురా కొడకా! తంతే బూరల గంపలో పడ్డమంటే యిదే. బతికి సుఖపెట్టడమే గాక చచ్చీ సుఖపెడ్తున్నాడు. గవర్నమెంట్ ఉద్యోగి చచ్చినా వెయ్యే. బతికినా వెయ్యే. అదే నీ తండ్రి చస్తే ఏమొస్తాది.

దహనం ఖర్చు తప్పు... ఏమిటీ వికృత ఆలోచన. సిగ్గులేదురా నీకు. నిన్ను చదివించడం కోసం టౌనుకు పంపి, తాము తినో, తినకో మిగిల్చిన డబ్బుని నెలనెలా ఠంచనుగా మనియార్డర్ల రూపంలో పంపడం మరిచిపోయావా... నీ సరదాలకీ, షికార్లకీ, సిగరేట్లకీ... ప్రయివేట్లని, పుస్తకాలని, పరీక్షలని, ఫీజులని మాయమాటలు చెప్పి నమ్మించి డబ్బులు ఇష్టానుసారంగా ఎగరేసుకు పోయి జల్సా చేసుకున్నది గుర్తు లేదా... పోయిన దసరాకు ఊరెళ్ళినప్పుడు నాన్న చిక్కిపోయి, పీక్కుపోయిన నీ ముఖాన్ని చూసి దిగులుగా దగ్గరకు తీసుకొని "వురా! నాయనా! గత నాలుగేళ్ళుగా సూస్తున్నా. వస్తాదో రాదో తెలీని ఉద్యోగం కోసరం, కడుపు నిండా తిండిక్కూడా లేక పస్తులుంటూ ఆ టౌన్లో యేముంటావ్ గానీ... వచ్చేయ్. ఈ గిర్నీ మీద యెంత కాదన్నీ నెలకు ఓ పదైదు నూర్లన్నా వస్తాది. దేవుడు దయ తలిస్తే ఆ నాలుగెకరాలు సంవత్సరానికోసారైనా పండకపోవు" అంటూ కన్నీరు పెట్టుకున్నారు.

ఎం.ఏ. హిస్టరీలో డిస్టింక్షన్ సాధించావు. బీయూడీ పూర్తి చేశావ్. గిర్నీ దగ్గర ముఖానికి పిండి కొట్టుకుంటూ కూర్చుంటే నీ స్నేహితులంతా నవ్వరా. మెట్ట... ఏం లాభం. వానల్లేవు. పోయిన సారి మీ నాన్న వేసిన పొగకు ఘుటు నసాళానికి తాకి ఐదువేలు అప్పు మిగిల్చింది. గింజలకు గతి లేని ఈ రాళ్ళ గుట్టలలో ముత్యాలు రాసులుగా పోసి అమ్మారంటుంది నీవు చదివిన హిస్ట్రీ. వలసలు, హత్యలు, ఆత్మహత్యలు, ప్యాక్షన్ రాజకీయాలతో ఓడలు బళ్ళవుతున్నాయే గానీ బళ్ళు ఓవడలవడం లేదు.

ఈ వ్యవసాయం, గిర్నీ పని నువ్వు చేయలేవు. ఏదో ఒక వుద్యోగం నీ కోసం ఎదురుచూస్తునే వుంటుంది. నిరాశపడక ప్రయత్నించు. ఏమన్నాడే మొన్న మీ హైటెక్ ముఖ్యమంత్రి... పనికి రాని చదువులట! కంప్యూటర్ లాంటివి నేర్చుకోవాలట!! నిజమే... కానీ ముందే చెప్పాల్సింది. నీవీపాటికి నేర్చుకొని ఈ దేశాన్నొదిలి ఏ విదేశాలకో ఎగిరిపోయి, ఏ దేశమేగినా ఎందు కాలిడినా ఏ.సీ. క్లాలో విలాసంగా తిరుగుతూ, సారే జహాసే అఛ్ఛా హిందూస్థాన్ హమార హమారా అంటూ భరతమాత కీర్తి పతాకను పైపైకెగుర వేసేవాడివి. ఇంత చదువూ చదివి ముడ్డికిందికి ముప్ఫై యేళ్ళోచ్చినాక యిప్పుడా చెప్పేది.

జాగ్రత్త. చూసి నడువ్. రోడ్డు దాటాల. నల్లని తార్రోడ్డు కాటేయ్యడానికి సిద్ధంగా వున్న కాలనాగులాగుంది. ఈనా కొడుకులకేంపనో... కొంపలంటుకుపోయినట్టు వేగంగా హారన్ కూడా కొట్టకుండా దూసుకుపోతున్నారు. కాస్త నెమ్మదిగా చూసి నడపొచ్చు గదా. ప్రజల జీవన ప్రమాణాల్లో, స్థితి గతుల్లో ఏ మాత్రం మార్పు రాకపోయినా రోజురోజుకీ మారిపోతుందీ రోడ్డు. ఫుట్‌పాత్‌పై బతికే నిరుపేదల సమాధులపై పచ్చని మొక్కలు. రోడ్డు మధ్య డివైడర్లు, పూలచెట్లు, అశోకవృక్షాలు, బటర్‌ఫ్లై స్తంభాలు, నియాన్ లైట్లు... ఆంధ్రదేశాన్ని నందనవనంగా మార్చడానికి నడుం బిగించిన నవ యువ ముఖ్యమంత్రి తెలుగుతల్లికి అప్పు చేసి పప్పుకూడు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు.

రోడ్లపై యువతనాన్ని నిర్వీర్యం చేస్తున్న పాన్‌పరాగ్‌ల, గుట్కాల ఎర్రని రక్తపు చారలు. గోడలపై నగ్న వక్షోజ సుందరీమణుల ఆహ్వాన పత్రాలు యువకులకు గాలం వేస్తూ, భారతీయ సంస్కృతీ పరిరక్షకులను పరిహసిస్తున్నాయ్. కొత్తగా వచ్చిన అపార్ట్‌మెంట్ సంస్కృతితో, కార్పొరేషన్ హోదాతో నగరం అందంగా పైపైకి విస్తరిస్తూ పోతూవుంది.

అదిగో పెద్దాస్పత్రి. సగం దూరం వచ్చేశావ్. కమాన్. నడు వేగంగా. ఏమిటా శబ్దం కిర్రు కిర్రు మని. వెధవ చెప్పులు. అందమైన కథలో అచ్చుతప్పులా ఎన్ని మేకులు దిగినాయో. భయపడకు. వూడిపోవులే. గట్టిగా కుట్టిచ్చావ్ కదా మొన్ననే. కాలం చెల్లినా, ప్రేక్షకులు తిరస్కరించినా వెండి తెరను పట్టుకు వేలాడుతున్న ముసలి హీరోలు మేకప్ చేసుకొని పడుచు హీరోల్లా భ్రమింపచేయడానికి విఫలయత్నాలు చేస్తున్నట్టు. పాలిష్‌తో నిగనిగలాడేలా చేశావ్.

పొయిన్నెల రాజశేఖర్ గాడు రాజ్‌దూత్‌పై రూంకొచ్చి కొత్తబండిని చూపిచ్చి పార్టీ యిచ్చి ఎలాగుందన్నాడు. ఏం చెప్పగలిగావారోజు. నల్లగా నిగనిగలాడుతూ మొత్తని తార్రోడ్డుపై సుతారంగా జారిపోతూవుంటే, ఆ బీట్ గుండెల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే వుంది కదూ. కొంటే అలాంటి బండే కొనాల. నిముషాల మీద హుషారుగా రయ్యిమని కోరుకున్నచోటికి, కోరుకున్న టైంకి, బ్లాక్ జీన్స్ పై వైట్ షర్ట్ టక్‌చేసి, నోట్లో గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్‌తో, నల్లని రేబాన్ కూలింగ్ గ్లాసులు పెట్టి, రివ్వున దూసుకుపోతూ, స్నేహితులను హలో! హాయ్!! అంటూ ధగధగ మెరిసే ఖరీదైన బ్రాస్‌లెట్ కనబడేలా

విష్ చేస్తూ, స్టైల్‌గా గాల్లో పొగ రింగులు రింగులుగా వదులుతూ, అమ్మాయిలంతా తిరిగి తిరిగి నిన్నే చూస్తుంటే, చిరునవ్వుతో కళ్ళతోనే గ్రీట్ చేస్తూ, పైకెగిసిపడే ముంగురులను సుతారంగా వెనక్కు దువ్వుతూ,

"ట్రింగ్... ట్రింగ్... కాస్త జరుగు నాయనా..."

"సారీ సారీ"

ఆకాశంలో సూర్యుడు ఆగ్రహంతో కదం తొక్కుతూ నేల తల్లి అంతు చూడటానికి తీక్షణ కిరణ పరంపరలను ఆపకుండా ప్రసరిస్తున్నాడు. రాయలసీమంటే భాస్కరునికి లవ్, మొహబ్బత్, ప్రేమ...! సగం దూరానికే నీ శరీరంలో వెచ్చని ఆవిరులు బైటికొస్తున్నాయ్. గొంతు తడారి పోయింది. అదిగో స్వాగత్ హోటల్. పద నీళ్ళు తాగి వచ్చేసేయ్.

చలువరాతి మెట్లు. ఆకలిని రేకెత్తించే కమ్మని సువాసనలు. కుర్చీపై స్టైల్‌గా ఆసీనులై చిరునవ్వు లొలికిస్తున్న పంజాబీలు, చుడీదార్లు, స్కర్టు, ఇన్‌షర్టులు, కూలింగ్ గ్లాసులు, సిగరెట్లు, బ్రాస్‌లెట్లు...

నాగరిక ప్రపంచంలోకి అడుగిడిన ఆటవికున్ని చూసినట్లు కౌంటర్లో ఓనర్ నిశితంగా నిన్నే గమనిస్తున్నాడు. ఎందుకురా తడబడతావ్. అటూయిటూ చూడకుండా తలొంచుకొని గమ్యస్థానానికి దూసుకుపో. ఎవరా కార్నర్ సీట్లో.... తెల్లని నాజూకైన శరీరంపై ఆరంజ్ కలర్ చీరకట్టి దేవకన్యలా వుంది. ఆ బ్లాక్‌పాంట్ యెల్లో షర్టు శాల్తీని తన్మయత్వంతో చూస్తూ, చేతిలో చేయి వేసి,

భుజంపై వాలిపోయి కబుర్లాడుతుంటే బుగ్గలపై విరబూస్తున్న సిగ్గుల నవ్వులు. ఏమా నవ్వు. రాయలసీమలో వర్షపు చినుకులు కురిసినట్టు. నీ ప్రియురాలు సంధ్య అచ్చం యిలాగే వుండేది కదూ. ఆ తెల్లని ఒళ్ళు, కోలముఖం, చక్రాల్లాంటి చిన్న కళ్ళు, ఏం చేస్తుంటాదో యిప్పుడు. నువ్వసలు గుర్తుంటావా... పిల్లా పాపలతో హాయిగా అత్తవారింట్లో నవ్వుతూ తుళ్ళుతూ తిరుగుతూ వుంటాదేమో.

ఏకాంతంలో ఎన్ని సార్లు నీ బాహువుల్లో వొదిగి, వుద్రేకంతో పరవళ్ళు తొక్కుతూ ఎక్కడ బడితే అక్కడ ముద్దాడే నిన్ను చిరుకోపంతో వారిస్తూ... దారి తప్పిన శిరోజాలు నీ ప్రియురాలి సున్నితమైన బుగ్గలపై తారాడుతుంటే ప్రేమగా సవరిస్తూ... వికసించని ఎర్ర గులాబీలా ముడుచుకున్న అధరాలను నీ పెదవులతో విడదీస్తుంటే... అనుభూతులను నెమరు వేసుకుంటూ, తన్మయత్వంతో కనులు మూసుకొని, నీ మెడ చుట్టూ చేతులు వేసి, బలంగా గుండెలకు హత్తుకొని, పదేపదే ఐ లవ్ యూ అని పలవరించేది. లేపుకు పోవాల్సింది. తప్పు చేశావ్. ఇప్పుడు తల్చుకొని ఏం లాభంలే. ఆ రోజే... నీ రూం కొచ్చి "నాకు పెళ్ళి సంబంధం కుదిరిందని" చెప్పి, నీ వళ్ళో తలబెట్టుకొని దీనంగా, దిగులుగా ఏడుస్తూ "నన్నెక్కడికైనా తీస్కెళ్ళిపో... పెళ్ళి చేసుకుందాం" అని తెగించి పదేపదే ప్రాధేయపడిన రోజే చాత కాలేదురా నీకు. ఏమన్నావా రోజు...

ప్రేమకన్నా డబ్బు గొప్పది. అది లేకుంటే ఈ ప్రేమలూ, ఆప్యాయతలూ నిలువవు. నా పరిస్థితి నన్ను పోషించుకోడానికే సరిపోదు.

ఏదో ఒక ఉద్యోగం దొరికే వరకు వెయిట్ చేస్తే తప్పకుండా చేస్కుంటాను"

ఆహా! ఏం స్టేట్‌మెంటిచ్చావురా. మరీ ఉద్యోగం రాక ముందే ఎందుకు ప్రేమించినట్టో. భయం భయంగా తలొంచుకొని చదువు తప్ప వేరే ధ్యాసే లేకుండా, తన పని తాను చేసుకుపోతూంటే, చూసి, ఆకర్షింపబడి, వేటాడి, రాయబారాలు నడిపి, ప్రేమలేఖలందించి, విషాద గీతిక లాలపించి, ముగ్గులోకి దించావ్. అప్పుడైమెందో నీ జ్ఞానం. ప్రేమ ద్రోహి. నీలాంటోళ్ళ మూలంగానే...

"ఏం సార్! ఏమైనా కావాలా" వెయిటర్ వెకిలి నవ్వులో మార్మికమైన పరిహాసం.

"ఆ... అహా... ఏం లేదేం లేదు. జస్ట్ దాహ మేస్తుంటేనూ"

ఛ... ఛ... సిగ్గులేదురా నీకు. ఎక్కడ బడితే అక్కడ ఆలోచిస్తూ, అలాగే చూస్తూ... పదపద... బయటకు నడు. నీ అవస్థ చూసి ఆ అఖరి సోట్లో పిల్ల రుమాలడ్డం పెట్టుకొని కిసుక్కున నవ్వింది కదూ. దాన్ని... గొంతు పట్టుకొని... ఛ...ఛ... విరబూసిన తాజా రోజాల ఎంత బాగుంది. చేస్తుంటే అలాంటి పిల్లనే చేస్కోవాలి. ఆ ఎర్రి పెదాలను ముద్దాడుతూ, దగ్గరగా హత్తుకొని... ఏమైందిరా నీకు. సంస్కారాన్ని మరచి కనిపించిన ఆడదాన్నల్లా కళ్ళతోనే సంభోగించే బదులు పెళ్ళి చేస్కోరాదూ.

"గవర్నమెంట్ ఉద్యోగమొస్తేనే మగాడు పెద్దమనిషైనట్టు లెక్క."

గౌరీ శంకర్ గాడు పెళ్ళి మాటెత్తితే చాలు పడీ పడీ నవ్వుతూ అంటాడు. లాకౌట్లు, ప్రయివేటీకరణలు, ప్రపంచబ్యాంకు ఆదేశాలు,

స్వర్ణ కరచాలనాలతో రోజు రోజుకీ కుదించుకుపోతున్న సర్కారీ నౌఖరీల మధ్య 2020 కల్లా మగాళ్ళంతా పెద్దమనుషులు కాకుండానే మిగిలిపోతారేమో! మారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్. ఎక్కడో ఎవరితోనో రాసిపెట్టె వుంటాడు. నెత్తినిండా నిండిపోతున్న తెల్ల వెంట్రుకలకి రంగేసెయ్. ఫెర్ అండ్ లవ్‌లీ పూయక ముఖం మరలా పూర్వపు రంగుకి తిరుగుతూవుంది. ఆరు వారాల్లో నీ అసలు రంగు బయటపడ్డం ఖాయం.

"బాబూ... నాయనా..."

ఎవరా మలుపు దగ్గర. చినిగి మాసిన చీరతో ఒళ్ళును దాచుకుంటూ, తైల సంస్కారం లేని జుట్టుతో, మాసిన ఒంటితో, అరిచీ అరిచీ కీచుబోయిన గొంతుతో, వాహనాల రణగొణ ధ్వనులను దాటి హృదయాంతరాళను తాకేలా దీనంగా అరుస్తూవుంది. ఆ బిచ్చగత్తె కళ్ళు స్కానింగ్ మెషిన్లలా నీ హృదయంలో దయాదాక్షిణ్యాలు ఏ కోశానన్నా వున్నాయా అని అణువణువూ పరిశోధిస్తున్నాయ్. చూడొద్దు. ఆ కళ్ళు అయస్కాంతంలా నీ జేబులోని చిల్లరను లాగేస్తున్నాయి. దాటేయ్. ఏమీ ఎరగనట్లు, విననట్టు, చూడనట్టు... ఓ పావలా వేస్తే... వుండేది రెండ్రూపాయల బిళ్ళేరా ఫూల్. చాయ్‌కి, సిగరెట్‌కి ఎవర్నడుక్కుంటావ్.

"నాయనా బాబూ... కాస్త ధర్మం చేయ్ నాయనా... నీకు పుణ్యముంటాది"

అటువేపు చూడకుండా నడక వేగాన్ని పెంచు. కమాన్ స్పీడు. వెనుకనుంచి పిలుపులు యింకా వెంటాడుతూనే వున్నాయా...

ఈ సారి జీతమొస్తూనే తప్పకుండా ఓ రూపాయైనా దానం చేయ్. తిట్టుకోనింటాదేమో. ప్రతి రోజూ ఇదే చోట విసుగు చెందకుండా నీకు అగ్ని పరీక్ష పెడుతూనే వుంది.

పాపం. ఎంత జాలిగా... బాబూ ధర్మం... బాబూ... బాబూ దయ... బాబ్దయ... అయ్యా... బాబూ... కాస్త డబ్బెయ్యండయ్యా. పేద రాష్ట్రమయ్యా. దయచూపండయ్యా. ఆలిండియా అడుక్కుతినే సంఘానికి మనోడే ప్రెసిడెంటు. ఆహా! అదీ అప్పు తెచ్చే పద్దతంటే. ఓ ఫైవ్ హండ్రెడ్ క్రోర్సుంటే అప్పియ్యి గురూ. ఎలా పట్టుకొస్తున్నాడో. ఏమి తాకట్టు పెడుతున్నాడో. ఏమిటో ఆ టెక్కిక్కు. కూర్చోబెట్టి కొక్కోకోలా తాపుతూ... కోలా... మీలాంటోళ్ళనేరా నమ్మేదీ లోకం. పోయిన సంవత్సరం నీవు బ్యాంకు లోను కెళళితే ఆ మేనేజర్ గాడు "మీ లాంటోళ్ళందరికీ యిస్తే బ్యాంకులు యేత్తేస్కోవాల" అన్నాడు. దొంగనాకొడుకు. యక్ష ప్రశ్నలు. లక్ష పరిశోధనలు. పూచీలు, తాకట్టులు, లంచాలు, సిఫారసులు. ఎక్కడ్నించి తాగలవురా నీవు.

"వయ్యారి భామా నీ హంస నడక. ఎందుకే ఆ తొందర తొందర..." ఎదురుగా పోతున్న అమ్మాయిని చూస్తూ తన్మయత్వంగా పాడుతున్న కాలేజీ స్టూడెంటు. రాస్కెల్. ఇలాంటోళ్ళందర్నీ మక్కలిరగ దన్నాలి. కాలేజీలో నీ స్నేహితురాలు హేమను ఎకనామిక్స్ స్టూడెంట్లు ఏడిపించినందుకు, ఆ రోజు రాత్రే నీ బ్యాచ్‌తో వాళ్ల రూం మీదికి దాడిచేసి తుక్కు తుక్కు కింద కొట్టావ్. "అసలిలాంటి రోగ్సందర్నీ షూట్ చేసి పారేయ్యాలి" అంటుంది కోపంగా నీ ముద్దుల చెల్లెలు

శ్రీలత. నువ్వంటే దానికెంతో ప్రేమ. పోయినసారి పండుగకు ఐదొందలు అప్పుచేసి దానికి చీర కొనిచ్చావు.

‘‘ఇప్పుడెందుకురా ఇవన్నీ. నేనేమైనా అడిగానా. రేపు నీకుద్యోగమొచ్చాక నీ యిష్టమొచ్చినట్టు కొనిపెట్టు వద్దంటానా” అంది పెద్ద ఆరిందలా.

ఎప్పుడో ఓ సారి ఇంటికెళితే మెరిసే కళ్ళతో ఒళ్ళంతా తడుముతూ ఆరోగ్యాన్ని పట్టిపట్టి పరీక్షించి తృప్తి పడతాది నీ తల్లి. ఏనాడూ ఏమీ కొనివ్వలేక పోయినా, సంతోష పెట్టకపోయినా కళ్ళ నిండా వెలుగులు నింపుకొని, పరుగెత్తుకొని ఎదురొచ్చి నీ చేతి సంచీని అందుకుంటుంది నీ చిట్టి చెల్లెలు. ఈ పాటికి దానికి పెళ్ళైపోవాల్సింది. నీకుద్యోగమొస్తే నీకొచ్చే కట్నంతోనే దాని పెళ్ళి ముడిపడివుంది. ఆ గిర్నీ, మెట్ట అమ్మేసి, దాని పెళ్ళి చేసి చావో, బతుకో నీ వెంట వచ్చెయ్యమంటే ససేమిరా అంటాడు మీనాన్న.

సొంతూరిలో వున్న నాలుగు రోజులూ నాలుగు క్షణాల్లా గడిచి బరువైన హృదయంతో, జ్ఞాపకాలతో బయలుదేరుతూ వుంటే నీ కిష్టమైన చట్నీలు, పొడులు, తినుబండారాలు సంచీలో సర్ది కళ్ళ నీళ్ళతో నీ తల్లి “ఆరోగ్యం జాగ్రత్తరా. సంక్రాంతికి తప్పకుండా రా” అంటుందే గానీ ఏనాడూ నీ చాతగాని తనాన్ని ప్రశ్నిస్తూ సూటిపోటి మాటలనదు. నీ తల్లి భుజంపై గడ్డ మానించి దిగులుగా నువ్వ కనుచూపుమేర దాటిపోయేంతవరకూ చెయ్యూపుతూనే వుంటాది నీ చిట్టి చెల్లెలు.

ఆ ప్రేమా, ఆప్యాయతలు చూస్తే నీకు భయం. అవి కలకాలం నిలవాలంటే నువ్ ఖచ్చితంగా ఉద్యోగం సంపాదించి తీరాల్సిందే.

'‘రేయ్! నాకు తెల్సిన ఎయిడెడ్ స్కూలొకటుంది. ఇంకో అర్నెల్లలో ఎస్జీ టీచర్ పోస్టు ఖాళీ. ఓ లక్ష రెడీ చేసుకున్నావనుకో రిజర్వు చేసుకుందాం. మనకు బాగా తెల్సినోడేలే” అన్నాడు నీ స్నేహితుడు నాగరాజు, విజయ్ గాని పుట్టిన్రోజు పార్టీనాడు. ఏం చెప్పగలిగావ్. లక్షంటే మాటలా. ఆ లక్షే వుంటే మొన్న ఎస్సయి ఎగ్జామ్ టెస్ట్ పాసై ఇంటర్వ్యూకెళ్ళినప్పుడు, వాళ్ళడిగిన డబ్బు మొఖాన కొట్టి ఉద్యోగం సంపాదించగలిగే వాడివి. వంద రూపాయలకే వంద మంది చుట్టూ తిరుగుతున్నావ్. అందరూ నీకు తగ్గ స్నేహితులే... సవర్ణాలే... ఆఈఉఊబూలకు అవే అచ్చులు పరమైనప్పుడు దీర్ఘమేకాదేశమౌతుంది. చిన్ననాడు తెలుగు పంతులు పట్టుపట్టి, అరచేతులు వాచిపోయేటట్టు, కొట్టి కొట్టి నేర్పించిన పనికి రాని సూత్రాలు. జీవితంలో ముందే వేసుకున్న ఊహలు, అంచనాలు తలకిందులవుతున్నాయి. నీ కాంపోజిషన్ నిండా అచ్చుతప్పులే.

పాత బస్టాండ్. మూడు మైళ్ళు పూర్తయ్యాయి. పొద్దున తిన్న రెండిడ్లీలు అరిగి పోయినట్టున్నాయ్. కమాన్ జస్ట్... ఇంకో అయిదు నిముషాలు. సాయిబాబా గుడిపక్క ంసదులోనే రాముగాని రూం. కొండారెడ్డి బుర్జు నగరానికే తలమాణికంగా గర్వంగా తలెత్తుకొని ఆకాశంలోకి చూస్తూ వుంది. పాపం! ఈ మధ్యనే అర్ధరాత్రి అదుపు తప్పి గుద్దిన సిటీబస్ దెబ్బకు శత్రు ఫిరంగి తాకిన కోటలా

గిజగిజలాడి ఓ వైపు పడిపోగా, మరలా కొత్తగా కట్టించి రక్షణ వలయం ఏర్పాటు చేశారు.

ఏమిటా పోస్టర్. సినిమా వాల్ పోస్టర్ల మధ్యన ఎర్రని అక్షరాలతో సగం చినిగి.

"ఎన్‌కౌంటర్లను ఖండించండి"

ఏ ఎన్‌కౌంటరో. ప్రతిరోజు నమోదవుతున్న హత్యలలో వీనిది ఎన్నో నంబరో. ఆ నక్సలైట్లలో చేరినా బాగుండేది. రెండు సంవత్సరాలు డ్యూటీ చేసి, వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటే ప్రభుత్వం నీకు పునరావాసం కల్పించేది. లొంగిపోయేంతలోపు ఆ ప్రిన్సిపాల్ గాన్ని... ఏమన్నాడు మొన్న... నీ స్నేహితునికి ఆక్సిడెంటై పెద్దాస్పత్రిలో చావు బతుకుల మధ్య పోరాడుతున్న కబురు విని, ఏనాడూ అడగని నీవు అర్ధగంట పర్మిషనడిగితే "ఇట్లా ఎప్పుడు బడితే అప్పుడు పంపించడం కుదరదోయ్. ఇది ఎగ్జామ్స్ టైమ్. స్కూలన్నాక ఓ పద్ధతుంటాది. ఈరోజు నిన్నొదిలితే రేపు మరొకరడుగుతారు. డిసిప్లిన్ దెబ్బతింటుంది" నిర్మొహమాటంగా, కర్కశంగా చెప్పాడు.

డిసిప్లినంట డిసిప్లిన్. బానిస చాకిరీకి మరొకపేరు. ఆనాకొడుకుని గన్నుతో... వూహూ... అంత సులభంగా చంపకూడదు. స్కూలు మధ్య నున్న జెండా పోలుకు కట్టేసి, టీచర్లూ, విద్యార్థులూ అందరూ చూస్తూండగా, పిచ్చికుక్కను కొట్టినట్టు కొట్టి ఆపై కాల్చాలి. అంతలోపు ఎవరైనా పోలీసులకు ఫోన్ చేస్తే... పట్టుబడితే... నిన్నొదుల్తారా. అనుచరుల జాడ చెప్పమని

చిత్రహింసలు పెట్టి కాల్చిపారేస్తారేమో. అమ్మా నాన్న నీ శవంపై పడి భోరున విలపిస్తారు. నిన్నే నమ్ముకున్న నీ చెల్లేమవుతుంది. ఎల్లైసీ డబ్బన్నా వస్తుందా. వస్తే నాలుగు రోజులు ఏడ్చినా, ఆపైన సంతోషిస్తారేమో...

హాలో! అసలు నీకంత ధైర్యముందా. ఎందుకురా నీకీ ఆచరణ లేని అనవసరమైన ఆలోచనలు. చాతగాని నాయాలా. కాలేజీ రోజుల్లో యేనియన్‌తో కలిసి యాజమాన్యల దౌర్జన్యాల నెదిరించి, కోరికలు సాధించేంతవరకు యూనివర్శిటీని స్తంభింప జేసిన నీ ఆవేశం... బతుకు పోరాటంలో, భయంతో రాజీపడి ఆవిరై పోయింది గదూ.

గవర్నమెంట్ ఉద్యోగాలు చేసుకుంటూ, తాము పనిచేసే ప్రయివేట్ యాజమాన్యాల కింద అత్యంత విధేయులుగా మసలుతూ, చేతినిండా డబ్బుతో, తమ పిల్లలకి సకల సౌకర్యాలూ సమకూరుస్తూ, సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థకు నిలువుటద్దాలైన ధనిక దేశాలకు తమ పిల్లలకు ఉద్యోగాలకై పంపించి, రెండు చేతులా సంపాదిస్తూ, విప్లవాల గురించీ, హక్కుల గురించి మాట్లాడే వాళ్ళమాటలు విని, రచనలు చదివి ఆనాడు నిజమనుకున్నావ్. కమ్యూనిష్టు ముఖ్యమంత్రుల కొడుకులు కాపిటలిస్టులుగా మారినా, వారి పెళ్ళాలు పరమ భక్త పతివ్రతా శిరోమణులుగా తయారైనా గమనించలేకపోయావ్.

మాటలో ఉచ్చులో పడి అందరి మాటలూ నమ్మి, యాజమాన్యానికెదురు తిరిగి నీ మొదటి ఉద్యోగం పోగొట్టుకున్నావ్.

ఎవరూ తోడు రాక ఒంటరి పోరాటం చేయలేక అభిమన్యునిలా నిస్సహాయునివై విలవిల లాడిపోయావ్. నీవు కలలు గన్న ప్రయివేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. ఎవరికి వారు తప్పించుకున్నారు. ఆరు నెల్లు ఆకలి నేర్పిన జీవిత పాఠానర్థం చేసుకొని అందరిలా నీవూ రాజీపడ్డావ్. నీ ఉడుకు నెత్తుఉ రోజురోజుకీ చల్లబడి గడ్డకట్టడం మొదలుపెట్టింది.

పదైదొొందల సంపాదన కోసం ఎన్ని స్కూళ్ళు తిరిగావు. ఎన్ని ఇంటర్వ్యూల్లో పాల్గొన్నావ్. ఆత్మ గౌరవాన్ని చంపుకొని వినయంతో వంగి వంగి నమస్కారాలు చేస్తూ పడిగాపులు గాచావ్. సప్లయ్ డిమాండ్ సూత్రంలో రోజురోజుకీ చదువుకున్న బానిస లెక్కువై, కూలీల కన్నా హీనంగా నీ విలువ తరిగిపోతూ వుంది. నీవు కాదంటే మరొకడు చాకిరీకి సిద్ధంగా వున్నాడు.

కమాన్ లెఫ్టటర్న్. అదిగో రాము గాని రూం. బైట మెట్లపై కూర్చొని సురేష్ ఆలియాస్ ఫ్రాన్సిస్ గాడు పేపర్ చదువుతున్నాడు. నిన్ను చూసినట్లున్నాడు. అతికం నా కొడుకు, ఏ అప్పుకోసమో వస్తున్నావనుకుంటుంటాడు. వాని పెదాలపై వెకిలి నవ్వు పరిహాసిస్తూ వుంది.

కమాన్. చేయి చాపు. ఇష్టమున్నా లేకపోయినా సంస్కారం కోసం, నాగరికునిలా గుర్తింపు పొందడం కోసం చాపాల్సిందే. షేక్ హ్యాండ్లూ, అపాలజీలూ, థాంక్సలూ, వెల్కమ్‌ల ముసుగులతో నాగరికత హొయలు పోతావుంది. పగలంతా కొట్లాడి రాత్రి ఐదు నిముషాలు కలిసే దంపతుల్లా ప్రేమా ఆప్యాయత ల్లేని స్పర్శ.

కమాన్ పేదాలపై చిరునవ్వు నతికించుకొని గట్టిగా నొక్కి స్నేహితుని గురించి వాకబు చేయ్.

"రామున్నాడా"

"లేడే. ఇప్పుడే బైటికెళ్ళాడు. పనుందా..."

"అహ... ఏం లేదు. ఈ అయిదొందలూ ఇవ్వు. థాంక్స్ చెప్పానని చెప్పు"

"దా కూర్చో! ఏమంత తొందర"

"లేదు... స్కూలుకి టైమైంది"

"సండే కూడానా?"

ఆ కళ్ళలో జాలి, భరించలేని ఎగతాళి.

కమాన్ అబౌట్ టర్న్. పద. నిన్ను చూస్తూనే వానికి నవ్వులాట. పెద్ద పుడంగి మాదిరి. నీవు ఏం.ఏ పూర్తి చేసేసరికి డిగ్రీ గట్టెకాడు. వాని నాన్న సివిలింజనీరు. వీనికి మైనార్టీ కాలేజీలో బీయీడి సీటు, ఎస్సీ కోటాలో ఉద్యోగం. చదువులో, కులంలో తప్ప అన్నింటిలో నీకన్నాపైనే. థూ... పుడ్తే రెడ్డి పుట్టుకన్నా పుట్టాల. ఎస్సీగా నన్నా పుట్టాల.

నీ ఇంటర్ క్లాస్‌మేట్ వెంకట్రెడ్డి గాడు మెడిషన్‌లో సీటు రాకున్నా, డొనేషన్ కట్టి, కర్ణాటకలో పట్టా తెచ్చుకొని, నటరాజ్ టాకీస్ పక్క సందులో సొంతంగా క్లినిక్ ఓపెన్ చేశాడు. ఆరు లక్షల కట్నంతో అందమైన పెళ్ళాం వెతుక్కుంటూ వచ్చి వరించింది.

"వురా! ఈ సదువులు వేస్ట్ రా. రాయడానికీ, సదవడానికీ వస్తే సాలు. యింత సదువు సదివించి సంపాదించడానికే గదా.

దానికి పెట్టే పెట్టుబడీ శ్రమా ఏదైనా మంచి యాపారంలో పెట్టుంటే ఈ పాటికి లచ్చలు కళ్ళ జూసేటోనివి. సమాజంలో పైకొచ్చినోళ్ళంతా యాపారాలు సేసినోళ్ళే. సదివినా యాపారానికో, యితరుల మీద ఆధారపడకుండా సొంతంగా నిలబడ్డానికో పనికొచ్చే సదువే సదవాల. ఆ గిర్నీ అమ్మేసి మంచి బిజినెస్ చేయ్. అదృష్టం తిరిగిందంటే నీ కలలన్నీ నిజమవుతాయ్"

టెన్త్ పాస్ గాకున్నా ఫర్టిలైజర్ వ్యాపారంలో లక్షలు సంపాదిస్తున్న రాజారెడ్డి నీకు హితబోధ చేశాడు. నీకు భయం. ఉన్నది గూడా పోతే నీ గతేమవుతుందోనని. పిరికినాయల. అసలు నువ్వు చదువుకోకున్నా బాగుండేది. ఈ ఫాల్స్‌ప్రిస్టేజీ లేకుండా, హాయిగా గిర్నీ ఆడించుకుంటూ, ఈ పాటికి పెళ్ళి చేసుకొని, పిల్లా పాపలతో... "ప్చ్... స్స్‌స్స్‌స్స్" ఈ తలనొప్పొకటి. ఆగని ఆలోచనల హోరుతో నీ మెదడు లోని నరాలపై వొత్తిడి తీవ్రమవుతూ వుంది.

యాభై రూపాయల ఫీజు తీసుకొని ఐదు నిముషాలు నీ కళ్ళు పరీక్షించి "ఎక్కువగా ఆలోచించొద్దు. మనసుకు విశ్రాంతి నివ్వు. ఈ అద్దాలు ఆర్నెల్లు వాడు. తగ్గిపోతుంది" అంటూ ముక్తసరిగా జవాబిచ్చి "నెక్ట్స్" అంటూ తన సంపాదనలోకి పడిపోయాడా కళ్ళ డాక్టర్. ఆ అద్దాలు ఎప్పుడూ రూంలోనే పడివుంటాయ్. తలనొప్పి రాక ఛస్తుందా. కాస్త నీ ఆరోగ్యం మీద శ్రద్ధ వహించు. నెగటివ్ థింకింగ్‌తో బాధపడుతున్న మనసును పాజిటివ్ థింకింగ్‌లోకి మళ్ళించు.

నీ యూనియన్ మిత్రుడు గిరి నీ నెగటివ్ వాదనలకే మాత్రం విలువనివ్వడు. "తాము నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణాలను సైతం లెక్క చేయని వాళ్ళ నుంచి స్ఫూర్తి పొందాలకాని, పేరుకోసం, డబ్బు కోసం ప్రాకులాడే అవకాశవాదులను చూసి నిరుత్సాహపడకూడదు. ఎవరొచ్చినా, రాకపోయినా, ఎన్ని కష్టాలెదురైనా నమ్మిన సిద్ధాం కోసం ఒంటరి పోరాటమైనా చేసి తీరాల్సిందే" అంటాడు. వాని మాటలింటున్నప్పుడు గడ్డ కట్టిన నీ రక్తం మరలా కరిగి, వేడెక్కి, సలసలా కాగుతూ వుంటాది. వాడెళ్ళి పోగానే అనుభవాలు వెంటాడి మంచుగడ్డగా మారతావు. నీకూ ఆ రచయితలకూ ఏమిటి రా తేడా. మీరంతా ఒక్కటే. అరే ఫూల్...! నువ్వూ వాళ్ళలో ఒకనివే. అవకాశవాదివే.

అదిగో చాయ్ హోటల్. ఒక కప్పు టీ తాగి, సిగరెట్టూదితే తలనొప్పి దానంతటదే మాయమవుతుంది. పద...

"షకలకల బేబీ... షకలకల బేబీ..."

బీప్ టేప్రికార్డర్లోంచి పెద్ద సౌండుతో గొంతు కీచుగా, మత్తుగా వస్తూవుంది. వేడి టీ నెమ్మదిగా శరీరంలో దూకుతూ దహిస్తున్న ఆకలిని చల్లార్చి, తాత్కాలికంగా కొత్త శక్తినీ, ఉత్సాహాన్నీ అందించడానికి సాగిపోతూ వుంది.

టీ బిల్లు కడితే అర్ధరూపాయి వెనక్కొంచిందా. పర్వాలేదు. బీడీలు కొనేయ్. నెలాఖరు రోజుల్లో సిగరేట్లు తాగేంత స్తోమత నీ కెక్కడిది. చుట్టూ ఎవరూ గమనించడం లేదు గానీ బీడీలు జేబులో వేసుకొని బైటపడు. అందరి ముందూ బీడీలు తాగడం కష్టం.

నీ పరిచయస్తుడెవరైనా నిన్నాస్థితిలో చూస్తే పరువు పోతుంది. ఈ నా కొడుకులు కూడా పనిలేనట్టు బీడీలు తాగేటప్పుడో, సినిమాకు సెకండ్ క్లాసుకు పోయినప్పుడో తగలడ్తారు.

నికోటిన్ కోసం మనసు పీకుతా వుంది కదూ. కమాన్ రైట్ టర్న్. సందు నిర్మానుష్యంగా వుంది.

అగ్గిపుల్ల భగ్గున మండి బీడీని వెలిగించింది.

పొగ లోపలికి పీలుస్తూవుంటే నీ మనసుకు హాయిగా, తృప్తిగా, పోగొట్టుకున్నదేదో దొరికినట్టుగా ప్రశాంతంగా వుంది కదూ. ఎవరా వేపచెట్టు దగ్గర. నిన్నే చూస్తూ వస్తున్నది. రాము గాడేనా...? ఆ నడక, ఆకారం వానిదే. కమాన్ తొందరగా నాలుగు దమ్ములు పీకి పాడేయ్. చూస్తే బాగుండదు. కమాన్ స్పీడ్.

ఒన్... టు... త్... ఖల్... ఖల్... ఖల్...

ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ తెరలు తెరలుగా దగ్గు.

రోడ్డుపై బీడీ... సన్నని గాలికి ఆరిపోలేకా, వెలగలేకా, ఆఖరి క్షణాల్లో ఆక్సిజన్ పుచ్చుకున్న రోగిలా...

అదిగో రాముగాడోచ్చేస్తున్నాడు. మనిషి దగ్గర కొస్తున్న కొద్దీ రెటినీపై రూపం స్పష్టత సంతరించుకుంటూ వుంది.

రామేనా... కాదా... ఎవడీడు. ఆనడక, ఎత్తు, లావు... నీ స్నేహితుడేనని భ్రమ పడ్డావ్ కదూ. అంతా భ్రమలే. ఐనా బుద్ధి రాక అసంతృప్తితో, నిరాశతో ఆవేశపడుతూ, అంతలోనే కలలు గంటూ, రాజీపడుతూ, ఏమూలో మిణుకు మిణుకు మంటూ

వూరిస్తున్న అందనీ ద్రాక్ష పళ్ళకోసం ఆరాటపడుతూ, ఎండమావుల వెంట పరుగులెత్తుతున్నావ్.

అదిగో స్కూల్. రోజు రోజుకీ పెరిగిపోతున్న విద్యార్థుల కోసం కొత్త అంతస్థులు తయారవుతున్నాయ్. గానుగ చుట్టూరా ఎద్దులు అప్పుడప్పుడూ విశ్రాంతి తీసుకుంటూ, తింటూ తిరుగుతూ వున్నాయ్. నీలాంటోళ్ళను ఇటుకలుగా పేర్చి, ఎటూ కదలకుండా కాంక్రీటు వేసి ఎక్కడి కక్కడ అత్యంత పటిష్టంగా బిగించి వేస్తున్నారు.

పదపద...

అత్యంత విధేయతతో ఆ కాంక్రీట్ కీకారణ్య పద్మవ్యూహంలోకి.

అభద్రతలో భద్రతను వెతుక్కుంటూ...

కాపాడుకుంటూ...

పోరాడుకుంటూ...

నిలుపుకుంటూ...

డా.ఎం.హరి కిషన్

9441032212

కాంక్రీట్ జంగిల్